## సంగీత పరీక్షల గడువు తేదీ పొడిగింపు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 24 : జిల్లాకేంద్రంలోని సుభాష్‌నగర్‌లో ఉన్న శ్రీ జ్ఞాన సరస్వతీ సంగీత నృత్య పాఠశాలలో కోర్సుల పరీక్షా ఫీజు గడువును మార్చి 3వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ రవీందర్ రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్టిఫికెట్ కోర్సు ఫీజు రూ. 4,500, డిప్లొమా కోర్సు ఫీజు రూ. 4,800 ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9849297679 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

## రేషన్‌షాపుల్లో తూనికల కాంటాలకు సీల్

వర్ని (రుద్రూర్), ఫిబ్రవరి 24 : వర్ని మండల పరిధిలోని రేషన్‌షాపుల్లో ఉన్న ఎలక్ట్రానిక్ తూనికల కాంటాలకు తూనికల శాఖ అధికారులు సోమవారం సీల్ వేయించారు. బియ్యం తూకం చేసే విషయంలో ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా, కాంటాల్లో సెట్టింగ్ చేయకుండా 15 కాంటాలకు సీల్ వేసినట్లు అధికారులు తెలిపారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

పోతంగల్, ఫిబ్రవరి 24 : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. పోతంగల్ మండలంలోని సుంకిని శివారులో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని, పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు వెల్లడించారు.

## పీసీ సర్కార్ మెమోరియల్ అవార్డుకు మెజీషియన్ రంగనాథ్ ఎంపిక



సుభాష్‌నగర్, ఫిబ్రవరి 24 : జిల్లా కేంద్రానికి చెందిన మెజీషియన్ రంగనాథ్ ప్రఖ్యాత పీసీ సర్కార్ మెమోరియల్ అవార్డుకు ఎంపికైనట్లు గాయత్రి ధార్మిక సాహితీ సేవా సంస్థ కార్యదర్శి అరుణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 40 ఏండ్లుగా జాతీయ, అంతర్జాతీయస్థాయిలో ఇంద్రజాల ప్రదర్శనలతో పాటు బాల్యవివాహాలు, మద్యపానం, ఎయిడ్స్ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్న నేపథ్యంలో అవార్డుకు ఎంపిక చేశారు. ఈనెల 27న రాష్ట్ర సాంస్కృతిక శాఖ, తెలంగాణ మ్యాజిక్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించే కార్యక్రమంలో అవార్డును అందుకోనున్నట్లు పేర్కొన్నారు.

## బేటీ బచావో - బేటీ పడావోపై అవగాహన




*అవగాహన కల్పిస్తున్న లింగ నిపుణురాలు కవిత*

కోటగిరి, ఫిబ్రవరి 24 : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బేటీ బచావో– బేటీ పడావో కార్యక్రమంపై మహిళా సాధికారత కేంద్రం లింగ నిపుణురాలు కవిత సోమవారం అవగాహన కల్పించారు. సమాజంలో పురుషులతో సమానంగా మహిళలకు హక్కులు ఉన్నాయని తెలిపారు. బాల్యవివాహాల ద్వారా కలిగే అనర్థాలను వివరించారు. విద్యార్థినులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బాలల పరిరక్షణ అధికారి సాయిలు, ఐసీడీఎస్ కోటగిరి మండల సూపర్‌వైజర్ కొమురవ్వ, పాఠశాల ప్రత్యేకాధికారిణి సవితారాణి, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, కట్టు కృష్ణకుమారి, కళావతి, జమున, బాలలక్ష్మి, సాయమ్మ, సావిత్రి, గంగామణి పాల్గొన్నారు.

# ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

**అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్**

కంఠేశ్వర్, ఫిబ్రవరి 24 : జిల్లాలో పదోతరగతి, ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించి, పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షించారు. మార్చి 5 నుంచి 25 వరకు ఇంటర్మీడియెట్ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. పదో తరగతి వార్షిక పరీక్షలు మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగుతాయని వివరించారు. ఇంటర్ పరీక్షలకు 36,222 మంది అభ్యర్థుల కోసం 57 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, పదోతరగతి పరీక్షలకు 22,915 మంది విద్యార్థులకు 141 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. పరీక్షలు సాఫీగా నిర్వహించేందుకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం పరీక్షల సమయాలకనుగుణంగా రవాణా సదుపాయం కల్పించాలని, సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆర్టీసీ, విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి పరీక్షా కేంద్రంలోనూ తాగునీటి వసతి, పరిశుభ్రమైన వాతావరణం నెలకొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో సాయాగౌడ్, డీఐఈవో రవికుమార్, జిల్లా పరీక్షల విభాగం సహాయ కమిషనర్ విజయభాస్కర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



*సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్*

## సబ్ స్టేషన్‌లో వీసీబీ ఏర్పాటు

పోతంగల్, ఫిబ్రవరి 24 : వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా పోతంగల్ సెక్షన్ పరిధిలోని హెగ్డోలి, కల్లూర్ సబ్‌స్టేషన్‌లో డివిజనల్ ఇంజినీర్ ముక్తార్ అహ్మద్ ఆధ్వర్యంలో వ్యాక్యూమ్ సర్క్యూట్ బ్రేకర్ (వీసీబీ)ను సోమవారం ఏర్పాటు చేశారు. కల్లూర్ టౌన్ 11 కేవీ ఫీడర్, కొడిచర్ల లిఫ్ట్ ఫీడర్‌కు కలిపి ఒకే వీసీబీ ఉండేదని, విద్యుత్ అంతరాయం కలగకుండా మరో వీసీబీ అమర్చినట్లు తెలిపారు. అసిస్టెంట్ డివిజన్ ఇంజినీర్ నగేశ్, ఇన్‌చార్జి ఏఈ ఫక్రుద్దీన్ ఖాద్రీ, సెక్షన్ విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.



*వీసీబీని ఏర్పాటు చేస్తున్న విద్యుత్ శాఖ అధికారులు*

## సీఎం పర్యటన నేపథ్యంలో పీడీఎస్‌యూ నాయకుల అరెస్ట్



*నాలుగో టౌన్ వద్ద పోలీసుల అదుపులో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్*

ఖలీల్‌వాడి/ ఆర్మూర్ టౌన్, ఫిబ్రవరి 24 : జిల్లాకేంద్రంలో పట్టభద్రుల ఎన్నికల ప్రచారం కోసం సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి వచ్చిన నేపథ్యంలో పీడీఎస్‌యూ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్‌ను ఉదయం ఇంటి వద్ద అదుపులోకి తీసుకొని, నాలుగోటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో నియంతపాలన కొనసాగుతున్నదని, స్వేచ్ఛ ప్రజాస్వామిక హక్కులను కాపాడుతానని హామీనిచ్చిన రేవంత్‌రెడ్డి.. ప్రశ్నించే గొంతులను అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. విద్యారంగంలో అనేక సమస్యలున్నాయని, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడాన్ని ఖండిస్తున్నామని పీడీఎస్‌యూ ఆర్మూర్ ఏరియా ఉపాధ్యక్షుడు వినోద్ అన్నారు. ఆర్మూర్‌లో ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా విద్యాశాఖ మంత్రిని నియమించలేదని, విద్యార్థులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు.

## ఆరో టౌన్ పరిధిలో మళ్లీ కత్తిపోట్ల కలకలం

- పక్షం రోజుల వ్యవధిలో రెండు ఘటనలు
- ఈ ఏరియాలో అదుపు తప్పుతున్న 'లా అండ్ ఆర్డర్'
- భయాందోళన చెందుతున్న స్థానికులు
- వివరాలు గోప్యంగా ఉంచుతున్న పోలీసులు

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 24 : జిల్లాకేంద్రంలోని ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు రోజుల క్రితం మళ్లీ కత్తిపోట్ల ఘటన కలకలం సృష్టించింది. ఈనెల 10న ఆరోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ యువకుడు తన పెండ్లి చెడగొట్టాడని ప్రత్యర్థిపై కత్తితో దాడి చేసిన ఘటన మరువకముందే మరో ఘటన చోటు చేసుకోవడంపై స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. ఆటోనగర్ ప్రాంతంలోని నయా బ్రిడ్జి ప్రాంతానికి చెందిన యువకుడు అక్బర్ ఓ మహిళను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఆమె తన కుటుంబీకులకు తెలిపింది. దీంతో ఫారూఖీ అనే యువకుడు తన స్నేహితులతో కలిసి అక్బర్‌ను నిలదీసేందుకు అతడి ఇంటికి వెళ్లాడు. వారి మధ్య మాటామాట పెరగడంతో అక్బర్ తన ఇంట్లో నుంచి కత్తి తీసుకువచ్చి ఫారూఖీ కడుపులో పొడిచాడు. గాయాలపాలైన బాధితుడిని చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు. ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడి కుటుంబీకులు తెలిపారు. ఈ కత్తిపోట్ల ఘటనపై ఆరో టౌన్ ఎస్సై వెంకట్ రావును వివరణ కోరగా.. కత్తిపోట్లు జరిగింది వాస్తవమేనని, వివరాలు ఒక నిమిషంలో తెలియజేస్తామని ఫోన్ కట్ చేశారు. వివరాల కోసం ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఎస్సై ఫోన్ లిఫ్ట్ చేయలేదు. నేరానికి సంబంధించిన విషయాలు మీడియాకు తెలియజేయాలని పోలీస్ ఉన్నతాధికారులు చెబుతున్నప్పటికీ కొంతమంది ఎస్సైలు మాత్రం కేసుల వివరాలు బయటికి తెలియకుండా గోప్యంగా ఉంచాల్సిన అవసరమేమిటనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాలు రహస్యంగా ఉంచడం వెనకాల ఆంతర్యమేమిటన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



*ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్న 2001– 02 బ్యాచ్ పదోతగరతి విద్యార్థులు*

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సారంగాపూర్, ఫిబ్రవరి 24 : మండలంలోని గుండారం గ్రామ జడ్పీహెచ్‌ఎస్‌లో చదివిన 2001–2002 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ఆదివారం సాయంత్రం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని జరుపుకొన్నారు. తరగతి గదుల్లో కూర్చొని, విద్యార్థి దశ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఆహ్వానించి, సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చారి, సత్యనారాయణ, సులోచన, గంగాధర్, ఎర్రన్న, పూర్వ విద్యార్థులు నవీన్, కందుల ప్రసాద్, గొర్రె గోపి, దేవదాస్, రవి, కిరణ్‌కుమార్, లక్ష్మి, గంగాదేవి, గంగాలక్ష్మి, విజయ, గోపిక తదితరులు పాల్గొన్నారు.

## నేడు మినీ జిల్లా బేస్‌బాల్ బాలబాలికల ఎంపిక

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 24 : మినీ బేస్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు నేడు (మంగళవారం) నిర్వహించనున్నట్లు బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎల్.మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సొప్పరి వినోద్ తెలిపారు. మండలంలోని సుద్దపల్లిలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో ఉదయం 9 గంటలకు ఎంపిక ఉంటుందని తెలిపారు. జనవరి 2013 తర్వాత పుట్టినవారు అర్హులని, పాల్గొనే క్రీడాకారులు జిల్లా కోచ్‌లు నరేశ్, మౌనిక, జ్యోత్స్నకు రిపోర్ట్ చేయాలని సూచించారు.

## చెరువులో పడి ఒకరి మృతి

డిచ్‌పల్లి (ఇందల్‌వాయి), ఫిబ్రవరి 24 : ఇందల్‌వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని లోలం చెరువులో పడి ఆదివారం ఒకరు మృతిచెందినట్లు ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపారు. ధర్పల్లి మండలం బెల్యాతండాకు చెందిన బదావత్ చిన్నా (16) పశువులు మేపేందుకు వచ్చి, ప్రమాదవశాత్తు చెరువులో పడి ఈత రాక మునిగి చనిపోయినట్లు తెలిపారు. సోమవారం ఉదయం 8 గంటల సమయంలో మృతదేహం లభించింది. మృతుడి తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## లైంగిక దాడి నిందితులను కఠినంగా శిక్షించాలి

ధర్పల్లి, ఫిబ్రవరి 24 : ఇద్దరు యువతులపై లైంగికదాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ భీమ్‌గల్ ఏరియా కార్యదర్శి బాలయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇలాంటి సంఘటనలు మరోమారు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్, మార్క్స తదితరులు పాల్గొన్నారు.

## కూనీపూర్ ప్రభుత్వ పాఠశాల తనిఖీ

వర్ని (రుద్రూర్), ఫిబ్రవరి 24 : వర్ని మండలం కూనీపూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలను వర్ని ఎంపీడీవో వెంకటేశ్వర్ సోమవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రికార్డులు, హాజరు పట్టికలు పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో బియ్యం, పప్పులతోపాటు వంట సామగ్రిని పరిశీలించారు.

## భారతీయ కిసాన్ సంఘ్ ఆలిండియా అధ్యక్షుడిగా సాయిరెడ్డి నియామకం



*సాయిరెడ్డిని సన్మానిస్తున్న వివిధ జిల్లాల భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు*

సారంగాపూర్, ఫిబ్రవరి 24 : మండలంలోని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన కొండెల సాయిరెడ్డి భారతీయ కిసాన్‌సంఘ్ ఆలిండియా అధ్యక్షుడిగా నియామకమయ్యారు. న్యూఢిల్లీలో ఆదివారం నిర్వహించిన అఖిల భారత స్థాయి భారతీయ కిసాన్ సంఘ్ ప్రతినిధుల మహాసభలో సాయిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సాయిరెడ్డికి శంషాబాద్ విమానాశ్రయంలో రంగారెడ్డి, మేడ్చల్, పాలమూరు జిల్లాల భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు ఘన స్వాగతం పలికి సన్మానించారు.

## టీమిండియాకు ఎమ్మెల్యే వేముల అభినందనలు

వేల్పూర్, ఫిబ్రవరి 24: చాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా పాకిస్తాన్‌పై విజయం సాధించటంపై మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో ఆనందం వ్యక్తం చేశారు. లక్ష్య సాధనలో కోహ్లి, శ్రేయస్ అయ్యర్ చాలా బాగా రాణించారని, పాకిస్తాన్‌పై విజయం సాధించడం ఎప్పుడూ ప్రత్యేకంగానే ఉంటుందని పేర్కొన్నారు. 140 కోట్ల భారతీయుల మనసును టీమిండియా గెలుచుకుందని టీమిండియాకు అభినందనలు తెలిపారు.

## పరీక్షలకు ముందు ఒత్తిడికి గురికావొద్దు



*సూచనలు చేస్తున్న మండల విద్యాధికారి నాగయ్య*

బోధన్ రూరల్, ఫిబ్రవరి 24: పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు ముందు ఒత్తిడికి గురికాకుండా చూడాలని, తల్లిదండ్రులు వారిని పరీక్షలకు సిద్ధం చేయాలని బోధన్ ఎంఈవో నాగయ్య సూచించారు. సోమవారం మండలంలోని కల్దుర్కి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన, మెరుగైన విద్య అందుతుందని, విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని అన్నారు. వారు చదువుపైనే దృష్టి కేంద్రీకరించే విధంగా ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాల్లో ఆందోళనకు గురికాకుండా ప్రశ్నలను ఒకటికి రెండుమార్లు చదివి జవాబులు రాయాలని సూచించారు. కఠిన ప్రశ్నల విషయంలో వాటి సమాధానాలు రాసే విధానం గురించి ఆయన వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవి, నగేశ్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గంగాధర్ పాల్గొన్నారు.

## నిత్య జీవితంలో క్రమశిక్షణతో మెలగాలి



*వరల్డ్‌క్లాస్ ట్రైనర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న విద్యార్థులు*

బోధన్, ఫిబ్రవరి 24: విద్యార్థులు నిత్య జీవితానికి విద్యను అన్వయిస్తూ క్రమశిక్షణతో జీవితాలు కొనసాగించాలని వరల్డ్‌క్లాస్ ట్రైనర్ ఎన్. చంద్రశేఖర్ సూచించారు. సోమవారం బోధన్ పట్టణంలోని రమాకాంత్ ఫంక్షన్ హాల్లో బోధన్, వర్ని మండలాలకు చెందిన ప్రైవేట్ పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై ప్రేరణాత్మక సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వరల్డ్‌క్లాస్ ట్రైనర్ ఎన్.చంద్రశేఖర్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు పరీక్షల ఒత్తిడిని ఎలా అధిగమించాలి, నిత్య జీవితంలో ఏ విధంగా ఎదగాలి అనే విషయాలను వివరించారు. కార్యక్రమం అనంతరం ట్రైనర్‌ను పాఠశాలల యాజమాన్యాలు, విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో విద్యావికాస్ కళాశాల చైర్మన్ యార్లగడ్డ శ్రీనివాస్ రావు, ఉషోదయ కళాశాల చైర్మన్ సూర్యప్రకాశ్, విజయసాయి హైస్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణ మోహన్, విజయసాయి కళాశాల చైర్మన్ సుబ్బారావు, వివేకానంద హైస్కూల్ చైర్మన్లు గజానంద్, సంతోష్, సుమారు వెయ్యి మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం భోజనం అందించాలి

**అదనపు కలెక్టర్ అంకిత్**

బాల్కొండ, ఫిబ్రవరి 24: మెనూ ప్రకారం భోజనం అందించాలని అదనపు కలెక్టర్ అంకిత్ భోజన నిర్వాహకులకు సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట గదిలో నిల్వ ఉంచి ఆహార పదార్థాలు, వంట దినుసులను పరిశీలించారు. విద్యార్థుల కోసం వండి ఉంచిన ఆహారాన్ని పరిశీలించారు. అంతకుముందు తరగతి గదులను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీవో విజయభాస్కర్, పాఠశాల ప్రత్యేకాధికారిణి ఉన్నారు. అంతకుముందు జలాల్‌పూర్‌లో మిషన్ భగీరథ ఇంటెక్ వాల్‌ను పరిశీలించారు.



*భోజనాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్*

### ఏర్గట్ల కేజీబీవీని తనిఖీ చేసిన డీఎల్‌పీవో

ఏర్గట్ల, ఫిబ్రవరి 24: మండల కేంద్రంలోని కేజీబీవీని డీఎల్‌పీవో, మండల ప్రత్యేకాధికారి శివకృష్ణ సోమవారం అధికారులతో కలిసి తనిఖీ చేశారు. కూరగాయలు, స్టోర్ రూమ్‌లోని సరుకులను పరిశీలించారు. బాలికల కోసం సిద్ధం చేసిన భోజనాన్ని పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. తరగతి గదులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీవో శివచరణ్, పంచాయతీ కార్యదర్శి జాకీర్, కేజీబీవీ ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.



*ఏర్గట్ల కేజీబీవీలో భోజనాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో శివకృష్ణ*

## వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి24: వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తున్నామని ఆర్మూర్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయానంద్‌రెడ్డి అన్నారు. కళాశాలలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నూతన విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం ఇప్పటి నుంచే ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ప్రతి రోజూ కళాశాలకు విద్యార్థులు హాజరయ్యేలా చూడాలని తల్లిదండ్రులను కోరారు. కళాశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నాయని, ప్రైవేట్ కళాశాలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందుతున్నదన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## నిరంతర విద్యుత్ సరఫరానే ధ్యేయం



*నూతన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద డీఈ ముక్తార్ అహ్మద్*

శక్కర్‌నగర్, ఫిబ్రవరి 24: సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు చర్యలు చేపడుతున్నామని విద్యుత్‌శాఖ డీఈ ముక్తార్ అహ్మద్ అన్నారు. బోధన్ పట్టణంలోని రాకాసీపేట్ ఖాజా మసీదు వద్ద, భీమునిగుట్ట గౌడ్స్ కాలనీలో, రుద్రూర్ రోడ్‌లోని పెద్దారెడ్డి రైస్‌మిల్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లకు ఆయన సోమవారం సాయంత్రం చార్జి చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో నిరంతర విద్యుత్ అందించాలనే ఉద్దేశంతో అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లు బిగించామన్నారు. వీటి ద్వారా లో ఓల్టేజీ సమస్య తలెత్తకుండా ఉంటుందని, వీటితో పాటు బోధన్‌లో మరో 15 ట్రాన్స్‌ఫార్మర్లు బిగించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డివిజన్ ఇంజినీర్ నగేశ్ కుమార్, ఏఈ నాయిని కృష్ణ, విద్యుత్ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

## పాత విద్యుత్ స్తంభాల తొలగింపు.. ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

మోర్తాడ్, ఫిబ్రవరి24: మండల కేంద్రంలో విద్యుత్ సిబ్బంది పదిరోజులుగా పాత విద్యుత్ స్తంభాలను తొలగించే పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. గతంలో వేసిన ఇనుప స్తంభాలు తుప్పుపట్టిపోవడం, ప్రమాదకరంగా మారగా వాటిని తొలగించి వాటి స్థానంలో 27 కొత్త సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేశారు. బస్టాండ్ ప్రాంతంలో విద్యుత్ లోడ్ పెరిగిన నేపథ్యంలో మసీదు ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. యానాం ప్రాంతంలో విద్యుత్‌లోడ్‌ను తొలగించేందుకు ఇప్పటికే కొత్తగా ఒక ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించారు. మండల కేంద్రంలో విద్యుత్ విషయంలో ఏ ఇబ్బందులు ఎదురైనా వారు ఏర్పాటు చేసిన గ్రూపులో సమాచారాన్ని అందిస్తే సిబ్బంది వెళ్లి మరమ్మతులు చేస్తున్నారు.



*మోర్తాడ్‌లో సిమెంట్ స్తంభాలను వేస్తున్న సిబ్బంది*

## ఊక లారీలతో ఇబ్బందులు..

- ప్లాస్టిక్ కవర్ల నుంచి రోడ్డుపై పడుతున్న వైనం
- వెనుక వచ్చే వాహనదారుల ఇబ్బందులు



*బోధన్– నిజామాబాద్ ప్రధాన రహదారిపై ఊకతో వెళ్తున్న లారీ*

శక్కర్‌నగర్, జనవరి 24: బోధన్– నిజామాబాద్ ప్రధాన రహదారిపై నిత్యం వెళ్తున్న ఊక లారీలతో ప్రయాణికులు, ముఖ్యంగా వాటి వెనుక వస్తున్న వాహనాలు, ద్విచక్రవాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లారీల్లో ఊకను నింపి, వాటిపై ప్లాస్టిక్ కవర్లను కప్పడంతో అవి లారీ సైజ్‌కన్నా రెండింతలు ఎక్కువ భాగంలో ఉండడంతో వెనుక వచ్చే వాహనాలు డ్రైవర్లకు కనిపించడం లేదు. అవి పక్క నుంచి వెళ్లకపోవడంతో, సైడ్ దొరకక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెనుక నుంచి ద్విచక్ర వాహనాలు వస్తే మాత్రం వారికి కంటినిండా ఊకతో నిండిపోతున్నది. వెనుకు నుంచి వస్తున్న వాహనాల వారు సైడ్‌కోసం హారన్ కొట్టినా, ఊక లారీల డ్రైవర్లకు వినిపించక, సైడ్ ఇవ్వకపోవడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారుల కండ్ల నిండా ఊకతో నిండి, ప్రమాదాలు జరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈ విషయంలో పోలీసులు, రవాణా శాఖ అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని వాహనదారులు కోరుతున్నారు.

**ఇబ్బంది కలిగితే ఫిర్యాదు చేయండి**

ఊక లారీల వారికి పలుమార్లు హెచ్చరించాం. అయినా వారు తీరు మార్చుకోవడం లేదు. ఇప్పటివరకు పలు కేసులు నమోదు చేసి, వారికి జాగ్రత్తలు పాటించాలని సూచించాం. అయినా వారు ఊకపై కప్పుతున్న కవర్లు సరిగా ఉండక, రోడ్డంతా ఊకపడుతున్న మాట వాస్తవమే. ఊకలారీలతో ఇబ్బంది కలిగితే దగ్గర్లోని పోలీస్ స్టేషన్‌లో పోలీసులకు సమాచారం అందించాలి. వారు సదరు లారీలను సీజ్ చేస్తారు. – *శ్రీనివాస్, బోధన్ ఎంవీఐ*

## ఆలయ ప్రాంగణంలో మరుగుదొడ్ల నిర్మాణం

నవీపేట్, ఫిబ్రవరి 24: మండలంలోని నాళేశ్వర్ గ్రామంలో ఉన్న అతి పురాతన రాజరాజేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో అదే గ్రామానికి చెందిన భక్తుడు పుప్పాల రమేశ్ మరుగుదొడ్లు, మూత్రశాలలను నిర్మించాడు. ముఖ్యంగా మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు ఇబ్బంది కలుగకుండా వీటిని నిర్మించినట్లు రమేశ్ తెలిపారు. తన తల్లిదండ్రులు పుప్పాల గంగవ్వ, లింగన్న జ్ఞాపకార్థం సుమారు రూ.3లక్షల వ్యయంతో వీటిని నిర్మించినట్లు ఆయన తెలిపారు. వీటిని ఆయన సోమవారం గ్రామాభివృద్ధి కమిటీకి అప్పగించారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ ద్యాగ సరీన్, సొసైటీ చైర్మన్ మగ్గరి హనుమాండ్లు, మాజీ సర్పంచ్ నర్సింగ్‌రావు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు బాగాజీ లక్ష్మణ్, పుప్పాల శ్యాం, రాకేశ్, రాములు, రాజు గ్రామ పెద్దలు శేఖర్, నడిపన్న, గణేశ్, భీమ్ రెడ్డి పాల్గొన్నారు.



*మరుగుదొడ్లు, మూత్రశాలలు ప్రారంభిస్తున్న దాతలు, నాయకులు*

## వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి24: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్ అన్నారు. పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలు, కళాశాలలో సోమవారం విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలన్నారు. పరీక్షల ముందు ఒత్తిడిని ఎలా అధిగమించాలో వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో కృష్ణమూర్తి, హెల్త్ ఎడ్యుకేటర్ స్వామి, ప్రిన్సిపాల్ రాగ లత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తు వారి చేతుల్లోనే

ఏర్గట్ల, ఫిబ్రవరి 24: విద్యార్థుల భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉంటుందని ఇంపాక్ట్ ఫౌండేషన్ సభ్యురాలు వజ్జ నవనీత అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పీఎంఎస్‌హెచ్‌ఆర్‌ఐ పథకం కింద పాఠశాలలో ప్రేరణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు ఆత్మ విశ్వాసాన్ని ఎలా పెంపొందించుకోవాలి, ఎలాంటి లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలి, భవిష్యత్తును ఏ విధంగా నిర్మించుకోవాలో విద్యార్థులకు వివరించారు. అనంతరం ఆమెను ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో అమ్మ అదర్శ పాఠశాల చైర్‌పర్సన్ నాగరాణి, పాఠశాల గెజిటెడ్ హెచ్‌ఎం కోమరగిరి కృష్ణచారి, ఉపాధ్యాయులు మునీరుద్దీన్, రాజశేఖర్, పవన్, రాజనర్సయ్య, విజయ్‌కుమార్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే జరిమానా తప్పదు



*భీమ్‌గల్‌లో టిఫిన్ సెంటర్ యజమానికి జరిమానా విధిస్తున్న మున్సిపల్ కమిషనర్ గంగాధర్*

భీమ్‌గల్, ఫిబ్రవరి 24: పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని తగ్గించాలని మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ అన్నారు. సోమవారం పట్టణంలో పలు టిఫిన్ సెంటర్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా టిఫిన్ సెంటర్లు పరిశుభ్రంగా లేకపోవడం, ప్లాస్టిక కవర్ల వాడకాన్ని గుర్తించి ఆ టిఫిన్ సెంటర్ యజమానికి రూ.వెయ్యి జరిమానా విధించారు. అనంతరం బస్టాండ్ ప్రాంతంలో ప్రధాన రోడ్డుపై పండ్ల బండ్లను అడ్డంగా ఏర్పాటు చేసుకోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుండడంతో వాటిని రోడ్డుకు దూరంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రోడ్లపై దుకాణాలను ఏర్పాటు చేయవద్దని ఆదేశించారు.

## నేడు వాహనాల వేలం

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి24: పట్టణంలోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌లో మంగళవారం రెండు ద్విచక్ర వాహనాలనకు వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ స్టీవెన్ సన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కేసుల్లో పట్టుబడిన రెండు ద్విచక్ర వాహనాలకు ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వ్యక్తులు వేలంలో పాల్గొనాలని సూచించారు.